# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారత రక్షణ రంగంలోని అన్ని విభాగాలలో మహిళా బలగాలు ఉండటం గర్వకారణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- విపక్షాల ఆందోళనలతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- దేశంలో హైస్పీడ్ రైళ్ల రూపకల్పనకు భారతీయ రైల్వే చర్యలు చేపట్టిందని కేంద్ర ప్రభుత్వం లోక్ సభకు తెలిపింది.
- అంతర్జాతీయ వాణిజ్యానికి, పెట్టుబడులకు గమ్యస్థానంగా భారత్ మారిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.
- జార్ఖండ్ రాష్ట్రం 14వ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ అధ్యక్షులు హేమంత్ సోరెన్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ దళాలలోని అన్ని విభాగాలలో మహిళా బలగాలు ఉండటం గర్వకారణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కేరళలోని వెల్లింగ్టన్ ఊటీలోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్‌లో రాష్ట్రపతి ఈ రోజు కీలకోపన్యాసం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధభూమి అయిన సియాచిన్ ను ఇటీవల తాను సందర్శించిన విషయాన్ని గుర్తు చేసుకున్న ద్రౌపది ముర్ము నడవడానికి భయపడే క్లిష్టమైన ప్రదేశాల్లో కూడా మహిళా సైనికులు సేవలందిస్తున్నారని ప్రశంసించారు. భారత రక్షణ సామర్థ్యం ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని, ఆత్మనిర్భర్ స్ఫూర్తితో దేశం పనిచేస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓ ప్రముఖ వ్యాపార సంస్థపై వచ్చిన లంచం ఆరోపణలతో పాటు పలు అంశాలపై విపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. రాజ్యసభలో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, డిఎంకె తదితర పార్టీలు ఓ ప్రముఖ వ్యాపార సంస్థపై వచ్చిన లంచం ఆరోపణలతో పాటు పలు అంశాలపై గందరగోళం సృష్టించాయి. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రతిపక్ష సభ్యులను తమ స్థానాలకు తిరిగి రావాలని విజ్ఞప్తి చేసినప్పటికీ వారు నినాదాలు కొనసాగించారు. దాంతో సభను రేపటికి వాయిదా వేశారు. లోక్ సభలోనూ విపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించారు. వివిధ అంశాలపై నినాదాలు చేస్తూ... విపక్ష ఎంపీలు సభాపతి సమీపానికి వెళ్లారు. సభలో శాంతిభద్రతలు నెలకొల్పాలని సభాపతి కోరినప్పటికీ నిరసనను కొనసాగించారు. దీంతో సభను రేపటికి వాయిదా వేశారు. ఇదిలావుండగా, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ కమిటీ నివేదిక సమర్పణ సమయాన్ని 2025 బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకు పొడిగించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని లోక్ సభ ఆమోదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో హైస్పీడ్ రైళ్ల రూపకల్పనతో పాటు తయారీని భారతీయ రైల్వే చేపట్టిందని కేంద్ర ప్రభుత్వం ఈ రోజు లోక్ సభకు తెలిపింది. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే హైస్పీడ్ రైళ్ల సెట్లను ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) బీఈఎంఎల్ సహకారంతో రూపొందిస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ద్వారా తెలిపారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్ల మొత్తం ఆక్యుపెన్సీ 100 శాతానికి పైగా ఉందని మరో ప్రశ్నకు సమాధానంగా రైల్వే మంత్రి తెలిపారు. వందే భారత్ సేవల వేగాన్ని తగ్గించే ప్రతిపాదన ఏదీ లేదని తెలిపారు. అదే విధంగా రైళ్లలో అన్ రిజర్వ్ డ్ కంపార్ట్ మెంట్లను నిలిపివేసే ఆలోచన రైల్వే శాఖకు లేదని స్పష్టం చేశారు. పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని జనరల్ క్లాస్, స్లీపర్ క్లాస్ కోచ్ లతో సహా 10 వేల నాన్ ఏసీ కోచ్ లను తయారు చేయాలని భారతీయ రైల్వే యోచిస్తోందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ వాణిజ్యానికి, పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా భారత్ మారిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డిజిటల్ ఇండియా ప్రచారం దేశంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. భారత దేశం డేటా సెంటర్ గా నూ కృత్రిమ మేధస్సు పరిశోధనా కేంద్రంగా మారుతోందని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్ రాష్ట్రం 14వ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ అధ్యక్షులు హేమంత్ సోరెన్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని స్థానిక మోరాబాది గ్రౌండ్‌లో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు అఖిలేష్ యాదవ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్‌లు హాజరయ్యారు. జెఎంఎం అధ్యక్షులు హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి. కాగా, 81 మంది సభ్యులు కలిగిన రాష్ట్ర శాసనసభలో జెఎంఎం కూటమి 56 స్థానాలను కైవసం చేసుకోగా, ఎన్‌డిఏ కూటమి 24 స్థానాలలో విజయం సాధించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గోవాలో జరుగుతున్న 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) ఈరోజుతో ముగిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా దేశానికి చెందిన చిత్ర ప్రముఖుడు ఫిలిప్ నోయిస్‌కు సత్యజిత్ రే జీవిత కాల పురస్కారం ఇఫీ 2024 ను అందజేశారు. ఈ పురస్కారం కింద 10 లక్షల రూపాయల నగదుతోపాటు, సిల్వర్ పికాక్, దృవపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఎన్నో విలక్షణ చిత్రాలతో అంతర్జాతీయంగా ఆయన ఆకట్టుకున్నారు. కాగా ఈనెల 20వ తేదీ నుండి ఈరోజు వరకూ ఇఫీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వివిధ దేశాలకు చెందిన ఎందరో సినీ ప్రముఖులు ఇఫీ వేడుకకు హాజరయ్యారు. ఔత్సాహిక సినీ కళాకారులకు కూడా ఇఫీ వేదికగా మారింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన 3 సంవత్సరాల కాలంలో దేశంలో మహిళా పైలెట్ లకు కమర్షియల్ పైలట్ లైసెన్సులు జారీ చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విషయం పై పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ లోక్ సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వివిధ విమానయాన సంస్థలలో మొత్తం 11 వేల 775 మంది పైలట్లు పనిచేస్తూంటే వారిలో 1,767 మంది మహిళలు ఉన్నారని ఆయన తెలిపారు. పౌరవిమానయాన రంగంలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశంలో శిక్షణ పొందిన పైలట్లను ఇంకా అధిక సంఖ్యలో అందించేందుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సులభమైన ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ విధానాన్ని తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సైనిక, సాంకేతికపై పరస్పర సహకారాన్ని ఇరు దేశాలు పెంపొందించాలని భారత్, రష్యా నిర్ణయం మేరకు ఇండియా - రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ ఆధ్వర్యంలో సైనిక సహకారంపై వర్కింగ్ గ్రూప్ నాలుగవ సమావేశం మాస్కోలో విజయవంతంగా ముగిసింది. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ సమావేశం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యూహాత్మక ఆసక్తి ఉన్న రంగాలలో నిరంతర భాగస్వామ్యం సహకారం ప్రాముఖ్యతను వర్కింగ్ గ్రూప్ స్పష్టం చేసింది. రెండు దళాల మధ్య కార్యాచరణ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉమ్మడి విన్యాసాలను విస్తరించడానికి కూడా ఈ సమావేశం ద్వారా అంగీకారం కుదిరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగాళాఖాతంలో శ్రీలంకకు 100 కిలోమీటర్లు, నాగపట్నంకు 320 కిలోమీటర్లు, పుదుచ్చేరికి తూర్పున 410 కిలోమీటర్లు, చెన్నైకి 490 కిలోమీటర్ల దూరంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. గత ఇరవై గంటలలో తమిళనాడు తీర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయని పేర్కొంది. ఈ అల్పపీడనం ఈ నెల 30వ తేదీ నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరం దాటే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. కాగా, తీరం దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక అధికారులు కోస్ట్ గార్డ్ ను అప్రమత్తం చేసి సిద్ధంగా ఉంచారు. భారీ అలలు, బలమైన గాలులతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మత్స్యకారులు డిసెంబర్ 2 వరకు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,234 వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 79,043 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 23,914 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు క్షీణించి 84.49గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔనసు 2,645 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, కెనడాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడం అవసరమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కెనడాతో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో సంప్రదింపులు జరుపుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న శక్తులపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని భారత్ పదే పదే కోరిందని పేర్కొన్నారు. ఈ విషయాలన్నింటి మీద సంప్రదింపులు జరుగుతున్నాయని రాజ్యసభకు మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =